క్లుప్తంగా

నేడు జగనన్న పశు ఆరోగ్య సురక్ష

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): మండలంలోని కొటికలపూడి గ్రామంలో జగనన్న పశుఆరోగ్య సురక్ష శిబిరం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొని పశు వైద్య శిబిరం ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

నేడు 'పల్లెకు పోదాం'

వినగడప(గంపలగూడెం): గంపలగూడెం మండలం వినగడపలో మంగళవారం పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి పాల్గొంటారని పేర్కొన్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి వినగడపలో నిర్వహించే 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు కోరారు

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: విస్సన్నపేట సచివాలయం-2 పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం స్థానిక సచివాలయం-2 పరిధిలో సాయంత్రం నాలుగు గంటల నుంచి నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు లోకేశ్వరరెడ్డి తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

ముసునూరు: యువకుడు అదృశ్యంపై ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై ఎం.కుటుంబరావు కథనం మేరకు గుళ్లపూడి శివారు గుడిపాడుకు చెందిన నక్కనబోయిన రామకృష్ణ కూలి పనులతో జీవనం గడుపుతున్నాడు. జీవనోపాధి కోసం కొన్ని అప్పులు చేశాడు. అప్పులు తీర్చేందుకు తల్లి పేరున ఉన్న ఇంటిని ఏలూరులో తనఖా పెట్టి రూ.4 లక్షలు తెచ్చాడు. ఈ క్రమంలో భార్యను పుట్టింటికి పంపి, అక్టోబర్ 3వ తేదీ నుంచి ఎవరికీ చెప్పకుండా డబ్బుతో వెళ్లిపోయాడు. ఇప్పటివరకు కనిపించలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెదికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో అతని తల్లి లక్ష్మి ముసునూరు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి కార్తిక మాసోత్సవాలు

ముసునూరు: కార్తిక మాస ఉత్సవాలకు బలివేలోని ప్రసిద్ధ రామలింగేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. మంగళవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏటా కార్తిక మాసంలో అమృతవేళ బలేస్వామి ఆలయానికి శివ భక్తులు అధిక సంఖ్యలో హాజరై, త్రిలోచనుడికి జ్యోతిర్లింగాష్టక మంత్ర పఠనం, అభిషేకాలు, దీపార్చనలు, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజలు చేయడం ఈప్రాంత భక్తుల ఆనవాయితీ. తెల్లవారుజామున వచ్చే భక్తుల రాకపోకల కోసం, సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ ఆధ్వర్యంలో ఉత్సవ ప్రాంగణంలో విద్యుద్దీపాలు వేయించి, గ్రామంలో నుంచి ఉత్సవ ప్రాంగణం వరకూ వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: స్థానిక గంగా పార్వతి సమేత చంద్రశేఖరస్వామి దేవస్థానంలో కార్తిక మాసోత్సవాల నిర్వహణకు ఆలయంలో తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ కుక్కడపు హనుమాన్ వెంకటరత్నం, ఈఓ సీతారామయ్య తెలిపారు.

శివాలయాలు ముస్తాబు

గంపలగూడెం: కార్తిక మాసోత్సవాలకు మండలంలోని శివాలయాలను ముస్తాబు చేశారు. ఆయా ఆలయాల్లో స్వామికి మంగళవారం నుంచి విశేష అభిషేకం, ప్రత్యేక అర్చనలు నిర్వహిస్తారు.

పూజా ప్లేట్లు అందజేత

మైలవరం: మైలవరంలోని కోదండ రామాలయంలో పూజా కార్యక్రమాలకు దాతలు గుడివాడ హేమ సుధాకరరావు, కళావతి దంపతులు, వారి కుమారుడు 21 స్టీల్ ప్లేట్లు ఆలయ ప్రధాన అర్చకులు మారెళ్ల మాధవ శర్మకు సోమవారం అందజేశారు. రోజు స్వామి పూజా కార్యక్రమానికి ప్లేట్లు అందజేసినట్లు దాతలు తెలిపారు.

ఆనందోత్సాహాలతో దీపావళి

నూజివీడు: దీపావళి వేడుకలను మండల ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, మహిళలు ఆనందోత్సాహాల నడుమ బాణసంచా కాల్చి పండగను నిర్వహించుకున్నారు. సాయంత్రం 6.30 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు బాణసంచా కాలుస్తూనే ఉన్నారు.

ద్వారకా ఎస్టేట్‌లో..

పట్టణంలోని ఎమ్మెల్యే నివాసమైన ద్వారకా ఎస్టేట్‌లో దీపావళి ఉత్సవాలను ఆనందోత్సాహలతో నిర్వహించారు. ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు, ఆయన తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు(చంటినాయన)లతో పాటు పిల్లలు టపాకాయలు కాలుస్తూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు.

ఉత్సాహంగా దీపావళి

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో దీపావళి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఆలయాల్లో కుటుంబ సమేతంగా పూజలు చేశారు. ప్రతి ఇంటిని ప్రమిదలతో అలంకరించి చిన్నా పెద్దా తేడాలేకుండా ఉత్సాహంగా టపాసులు కాల్చుకున్నారు. ఈసారి దీపావళి ఆది, సోమవారాల్లో రావడంతో రెండు రోజులు టపాసులు కాల్చారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: మండలంలోని ప్రజలు ఆదివారం దీపావళి పండగను ఘనంగా నిర్వహించారు. మహిళలు లక్ష్మీపూజలు నిర్వహించటంతో పాటు దీపాలతో ఇంటి ముంగిట అందంగా అలకరించారు.

తిరువూరులో..

తిరువూరు: దీపావళి పర్వదిన వేడుకలు తిరువూరు పట్టణంలో ఘనంగా జరిగాయి. నివాసగృహాల ముంగిట దీపాలు వెలిగించి బాణసంచా కాల్చారు.

అక్షర దివిటీతో జీవితం వెలుగుమయం

ముసునూరు: అజ్ఞానాన్ని తరిమి వేసి, మనిషిని ఉన్నతునిగా తీర్చిదిద్దే మంచి ఆయుధం, వెలుగుదివిటీ అక్షర విద్య అని ముసునూరు బీసీ బాలుర హాస్టల్ వార్డెన్ షేక్ నజీర్ అన్నారు. ఆదివారం రాత్రి హాస్టల్ క్యాంపస్‌లో విద్యార్థులు దీపావళి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.



గంపలగూడెంలో ఓ గృహం వద్ద ముగ్గువేసి దీపపు ప్రమిదలు పెడుతున్న యువతులు



టపాసులు కాలుస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

గంపలగూడెంలో..

గంపలగూడెం: దీపావళిని గంపలగూడెం మండలంలో ఆదివారం వైభవంగా జరుపుకొన్నారు. సాయంత్రం ఇళ్ల ముంగిట ముగ్గులు వేసి, వాటిపై మట్టి ప్రమిదలు ఉంచి దీపాలు వెలిగించారు.

నెమలిలో నరకాసుర వధ

నెమలి(గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో దీపావళి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు గోపాలాచార్యులు అర్చకబృందం స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. రాత్రికి నరకాసుర వధ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సత్యభామ సమేత వేణుగోపాలస్వామి గ్రామోత్సం అట్టహాసంగా జరిపారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

మైలవరం: మైలవరం శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ శాఖాధికారి జే నాగార్జున సోమవారం తెలిపారు. ముఖ్యఅతిథిగా మైలవరం జమీందారు రాజా ఎస్వీ సుధాకరరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ ఎస్వీఎన్ నివృతరావు పాల్గొంటారని పేర్కొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో మంగళవారం నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గొల్లపల్లి గ్రంథాలయంలో..

మండలంలోని గొల్లపల్లి గ్రంథాలయంలో మంగళవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. విద్యార్థులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి గ్రంథాలయంలో మంగళవారం నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం తదితర పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి పి.భాను సోమవారం తెలిపారు.

గొల్లపూడి లైబ్రరీలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం కానున్నట్లు శాఖ అధికారి .వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలను గొల్లపూడి పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ శేషగిరిరావు ప్రారంభిస్తారని తెలిపారు.

మల్లాది రామారావుకు నివాళి

రెడ్డిగూడెం(మైలవరం): ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎమ్మార్పీఎస్ ఉద్యమాలకు శ్రీకారం చుట్టిన రెడ్డిగూడెం గ్రామానికి చెందిన మల్లాది రామారావు శనివారం హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధాన మోదీ సభలో పాల్గొనగా అక్కడే గుండెపోటుతో మరణించాడు. ఆయన మృతదేహాన్ని రెడ్డిగూడెంకు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదివారం రామారావు ఇంటికి చేరుకుని ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుపతిరావు, విజయ డెయిరీ జిల్లా డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ మల్లాది రాణి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మంద కృష్ణ మాదిగ

కేడీసీసీ పథకాలపై కళాజాత

తిరువూరు: కృష్ణాజిల్లా సహకార కేంద్రబ్యాంకు అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి ఖాతాదారులకు అవగాహన కల్పిస్తూ తిరువూరు మండలం లక్ష్మీపురంలో సోమవారం కళాజాత ప్రదర్శించారు. డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతా కార్యక్రమాల్లో భాగంగా బ్యాంకులో అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలు, లాకర్లు, సేవింగ్స్ ఖాతాలు, ఏటీఎం వినియోగం, బీమా పథకాలు, రూపీ కార్డులు, నగదు రహిత లావాదేవీలు తదితర అంశాలను వివరించారు. కేడీసీసీ కార్యదర్శి బొల్లినేని రఘురాం పర్యవేక్షించారు.

ఏ.కొండూరులో..

ఏ.కొండూరు: మండలంలోని చీమలపాడులోని పీఏసీఎస్ బ్యాంకులో సోమవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వారి ఆధ్వర్యంలో నాబార్డ్ వారి సౌజన్యంతో డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేడీసీసీ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, సెక్రటరీ కుటుంబరావు పాల్గొన్నారు.

దాములూరులో..

దాములూరు(ఇబ్రహీంపట్నం): కేడీసీసీ బ్యాంక్ ఖాతాదారులకు, రైతులకు అందిస్తున్న సేవలపై నాబార్డ్ వారి సౌజన్యంతో కళాజాత ప్రదర్శన సోమవారం నిర్వహించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తాతినేని పద్మావతి ఆదేశాల మేరకు మండలంలోని దాములూరు, మూలపాడు గ్రామాల్లో కళాకారులు ప్రదర్శన చేపట్టారు.

కార్ఖానాలో అగ్నిప్రమాదం

తిరువూరు: స్థానిక తోళ్ల బజారులో ఆదివారం రాత్రి షేక్ ఖాసింకు చెందిన కలప సామగ్రి తయారీ కార్ఖానాలో అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లేదా దీపావళి మందుగుండు సామగ్రి కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు భావిస్తున్నారు. సుమారు రూ.2లక్షల విలువైన కలప, విద్యుత్ మోటార్లు అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయాయి. వైఎస్సార్ సీపీ ముస్లిం నాయకులు షేక్ జాకీర్ తదితరులు దుకాణ యజమాని ఖాసింకు జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు.





















